క్లుప్తంగా

ఒకరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 38 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 34 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

శిల్పారామంలో సమ్మర్ క్యాంపు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేయనున్నారు. చిన్నచిన్న మట్టి కుండలు తయారు చేయడం, మదుబని పెయింటింగ్, చేరియాల్ పెయింటింగ్, నిర్మల్ , అక్రిలిక్, ట్రైబల్ పేయింటింగ్, పెన్సిల్ స్కెచ్, సంస్కృతం, భగవద్గీత శ్లోకాల నేర్పించడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మే1 తేదీ నుండి 19వ తేదీ వరకు ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు తరగతులు నిర్వహించబడతాయి.ఆసక్తి గలవారు నామమాత్రపు రుసుముతో రిజిస్టర్ చేసుకోగలరు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్. 8886652030, 8886652004లలో సంప్రదించగలరు.

గూగుల్ ఉమెన్ ఇంజినీర్స్‌కు గీతం విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థులు అస్మా మహ్మద్, సంఝున్నా బేతి, శ్రీప్రణతి మామిడి, సాయిశ్రీ కొడాలిలు గూగుల్ మద్దతుతో నిర్వహిస్తున్న టాలెంట్ స్ప్రింట్ మహిళా ఇంజినీర్స్ (డబ్ల్యూఈ) ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని గీతం కెరీర్ గైడెన్స్ కేంద్రంలోని కాంపిటెన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డబ్ల్యూఈ ప్రోగ్రాం అనేది మహిళా విద్యార్థులను ప్రపంచ స్థాయి ఇంజినీర్లుగా తీర్చిదిద్దే రెండేళ్ల కార్యక్రమమని, రూ.లక్ష స్కాలర్‌షిప్‌తో పాటు వందశాతం ఫీజు మినహాయింపు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఈ ప్రోగ్రాంకు ఎంపిక కావడానికి సహకరించిన తన సహోద్యోగులు, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజుకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గంగా జమున తెహజీబ్ తెలంగాణ

ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో గంగా జమున తెహజీబ్ సంస్కృతి పరిఢవిల్లుతోందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ముస్లింల అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఐనోలు గ్రామ శివారులోని టీఆర్ఆర్ కళాశాల సమీపంలో ఐదు ఎకరాల స్థలాన్ని ఖబరస్తాన్‌కు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ మెట్టు కుమార్, పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం పాల్గొన్నారు.

'ఎస్కీ' ఆధ్వర్యంలో ప్రత్యేక వెబినార్

రాయదుర్గం: పరిశ్రమ, అకడమిక్, స్టార్టప్, రీసెర్చ్ ఎకోసిస్టమ్‌తో కలిసి పనిచేయాలని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బికేసాహు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలజీ, ఎంప్లాయిబిలిటీ, ఐపీఆర్ అండ్ ఎంటర్‌ప్రెన్యూరల్ స్కిల్స్' అనే అంశంపై ప్రత్యేక వెబినార్‌ను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కుల ప్రాముఖ్యత, ఎన్ఆర్‌డీసీ గురించి వివరించారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ దీపన్‌సాహు మాట్లాడుతూ ఇన్నోవేషన్ ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించడం అవసరమని భారత ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ సమావేశంలో నేషనల్ వెబినార్ చైర్మన్ డాక్టర్ రంగారెడ్డి, రాజస్థాన్ సెంటర్ చైర్మన్ గుంజన్ సక్సేనా, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బ్రహ్మారెడ్డి, ఎస్కీ ఎఫ్‌డీపీ సెట్ నోడల్ ఆఫీసర్ పి సాయికిషోర్ ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ఎస్కీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు కాలే.. ప్రమాదాలు ఆగలే



అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు



తక్కువ ఎత్తులో నిర్మించిన బాక్స్ కల్వర్ట్

అసంపూర్తి రోడ్డుతో ఈదులనాగులపల్లివాసులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా తెల్లాపూర్, ఈదులనాగులపల్లి రేడియల్ రోడ్డు పనులు చేపట్టింది. సర్వీస్ రోడ్డు కంప్లీట్ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల బారినపడుతున్నారు. వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. లారీలు అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం నిరసన దీక్ష చేస్తామని బీజేపీ లీడర్ రాంబాబు గౌడ్ హెచ్చరించారు. సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్ తెలిపారు.

– రామచంద్రాపురం (పటాన్‌చెరు)

ఇక డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాం



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

- కాలనీలు, బస్తీల్లో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం
- ప్రతి డివిజన్‌లో కిలోమీటర్ చొప్పున భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్
- ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ
- రూ.12.15 కోట్లతో టీఎన్‌జీఓ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లిలోని అన్ని కాలనీలు, బస్తీలలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నా రు. రూ.8.75 కోట్ల వ్యయంతో టీఎన్‌జీఓ కాలనీలో, రూ.3.40 కోట్ల వ్యయంతో జర్నలిస్ట్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనులకు ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నాటికి పనులన్నీ పూర్తి చేసి ఈ ఏడాది సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కాలనీలు, బస్తీలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ఇప్పటికే మంచినీటి సమస్యలు తీర్చామని, విద్యుత్ సమస్య మెరుగు పడిందని, ఇక డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి పెట్టామన్నారు. ఇతర సమస్యలను దశలవారీగా తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు రాజశేఖర్, నారాయణ, నరేందర్, నాయకులు గణేష్ ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ.. ఇఫ్తార్ విందు

మియాపూర్: పండగలను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్తమహబూబ్‌పేట్, స్టాలిన్‌నగర్, ఎంఏనగర్‌లలో మసీద్‌ల వద్ద ప్రభుత్వం అందజేస్తున్న గిఫ్టు ప్యాక్‌లను ఎమ్మెల్యే గాంధీ ముస్లింలకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దీప్తీశ్రీనగర్ కాలనీలో..

చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీలోని మసీదు వద్ద ఇఫ్తార్ విందు ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరై ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దీప్తీశ్రీనగర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

ఇఫ్తార్ విందులో నాయకులు

పటాన్‌చెరు టౌన్: రంజాన్ నేపథ్యంలో పటాన్‌చెరు మండలం నందిగామలోని మదీన మసీదులో కాంగ్రెస్ నాయకుడు గోరే మియా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ శివానందం, ఉప సర్పంచ్ శ్రీశైలం, భానూర్ ఉప సర్పంచ్ ఇక్బాల్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిగ్నిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవ

- వివరాలు వెల్లడించిన నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ

సాక్షి, సిటీబ్యూరో: సిగ్నిటీ టెక్నాలజీస్ సహకారంతో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్మాణ్ వ్యవస్థాపకులు మయూర్ పట్నాల తెలిపారు. సిగ్నిటీ వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. నగరంతో పాటు సమీప జిల్లాల్లో విద్య, యువత ఉపాధి, మహిళా సాధికారిత, వైద్యం తదితర విభాగాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిరుపేదల కోసం సిగ్నిటీ తమ సీఎస్ఆర్ నిధులతో నాంపల్లిలోని ప్రభుత్వ యం.యస్.జే క్యాన్సర్ ఆసుపత్రిలో మెడికల్ పరికరాలతో పాటు ప్రత్యేక గైనకాలజీ వార్డును ఏర్పాటు చేశారన్నారు. అంతేకాకుండా నల్గొండ జిల్లాలో మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారుల కోసం పిడియాట్రిక్ వార్డు ఏర్పాటు చేశారన్నారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ అమీర్‌పేట్‌కు చెందిన మహేందర్‌రెడ్డి అత్తాపూర్ నుంచి జహీరాబాద్‌కు బైక్‌పై ఈనెల 4వ తేదీన వెళ్తుండగా పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీపంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బైక్‌ను ఢీకొట్టిన వాహనదారుడిపై చర్యలు తీసుకోవాలని బుధవారం మహేందర్ సోదరుడు నరేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, స్కూటీ ఢీ

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గాయాలు

పటాన్‌చెరుటౌన్: కారు, స్కూటీని ఢీ కొట్టిన ఘటనలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్‌కు చెందిన రోహిత్ రెడ్డి ఫిబ్రవరి 13వ తేదీన అందోల్ నుంచి హైదరాబాద్‌కు తన స్కూటీపై బయలుదేరాడు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తా సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో రోహిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడటంతో ఆలస్యంగా ఫిర్యాదు చేస్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ పరిధిలోని బుచనెల్లి గ్రామానికి చెందిన నర్సమ్మ కూతురు పవిత్ర కొద్ది రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓఎఫ్ కాలనీలో ఉండే పిన్ని ప్రమీల ఇంటికి వచ్చింది. ఈనెల 8వ తేదీన ప్రమీల ఆస్పత్రికి వెళ్తున్నానని పవిత్రకు చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే చూసే సరికి పవిత్ర(19) కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): దళితుల ఆర్థిక అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండాలో ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. వెలిమెల తండాలో కోటి రూపాయలతో ఫంక్షన్‌హాల్, తన సొంత నిధులతో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్, భవానీమాత దేవాలయాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ జయరాం, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించడంలో విఫలం'

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర మహిళా మోర్చ మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి ఆరోపించారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో రేడియల్ రోడ్డు నంబర్ 7 కనెక్టివిటీ సమస్యను, స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకుడు రాంబాబు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో కేవలం నేతల భూముల కోసం, బడా వ్యాపారస్తుల కోసం ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేస్తోందన్నారు. కానీ సర్వీస్ రోడ్లు సరిగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతుంటే పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు, బీజేపీ తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు కోటి శంకర్, అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర మోర్చ కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్, నర్సింగ్ గౌడ్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యం

బీజేపీ రాష్ట్ర నాయకుడు గజ్జెల యోగానంద్

మియాపూర్: చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవం, అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చందానగర్ డివిజన్ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఉపయోగాలు, పండించడం, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల వాడకం, వాటి వలన కలిగే ఉపయోగాల గురించి వివరించారు. చిరుధాన్యాలను భవిష్యత్ ఆహారంగా మార్చడం అవసరమన్నారు. ప్రతి రోజు నడక, వ్యాయామం, యోగా అలవాటు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.అనంతరం చిరుధాన్యాలతో వండిన అల్పాహారాన్ని స్థానికులకు అందించారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు రాంరెడ్డి, సీనియర్ నాయకులు అంజన్నకుమార్‌గౌడ్, శివకుమార్ వర్మ, శ్రీనివాస్, అనిల్‌కుమార్‌గౌడ్, రాజుశెట్టి, వినయ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్న నాయకులు గజ్జెల యోగానంద్

మనూ 'ఐఎంసీ' పనితీరు భేష్

వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మనూలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) పనితీరు భేషుగ్గా ఉందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఐఎంసీ ద్వారా 'మనూ' నాలెడ్జ్ సిరీస్‌లో భాగంగా నిర్మించిన రెండు చిత్రాలు ఇంటర్ యూనివర్సిటీ కేంద్రమైన కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్(సీఈసీ) నిర్వహించిన సీఈసీ యూజీసీ ఎడ్యుకేషనల్ వీడియో ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రాలుగా ప్రశంసలు అందుకున్నాయి. ఈ నేపథ్యంలో వైస్‌చాన్స్‌లర్‌ను ఆయన కార్యాలయంలో ఐఎంసీ అధికారులు కలిశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ వారిని అభినందించారు. ఐఎంసీ రూపొందించిన చిత్రాలలో మొదటి చిత్రం 'అల్జఫ్రావి'కు ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ విభాగంలో ఉత్తమ చలనచిత్ర అవార్డును అందుకుంది. అదేవిధంగా 'రెండవ చిత్రమైన 'పాలిమర్' ది ప్రామిస్ ఆఫ్ పీడీఎంఎస్' ఉత్తమ చిత్రం/డాక్యుమెంటరీ అవార్డు కేటగిరి కింద సైటేషన్‌కోసం సిఫార్సు చేయబడింది.



వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్‌ను కలిసిన ఐఎంసీ సెంటర్ ప్రతినిధులు

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



ఏఎంసీ సుధీర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువజన సమాఖ్య నాయకులు

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని బస్తీలలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఏఎంసీ సుధీర్‌కు అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు ఇస్లావత్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ, ఓంకార్‌నగర్, స్టాలిన్‌నగర్, ముజాఫర్ అహ్మద్‌నగర్, నడిగడ్డతండా, సుభాష్‌చంద్రబోస్‌నగర్, టీఎన్‌నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, డైనమిక్ కాలనీలలో దోమలు విపరీతంగా పెరిగాయని, ప్రజలు అనారోగ్య పాలవుతున్నారన్నారు. మురికివాడల్లో, కాలనీల్లో వారానికి మూడుసార్లు ఫాగింగ్ చేయాలని కోరారు. నాయకులు దాసరి కీర్తి, ఎండీ సుల్తానాబేగం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య

పటాన్‌చెరు టౌన్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరించే కార్మికులకు ఇవ్వాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య అన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల విధుల నిర్వహణ, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే వాహనాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని వారు సైతం ఆటో కార్మికులకు అందజేయాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌సీపురంలో..

రామచంద్రాపురంలో పారిశుద్ధ్యం అమలు తీరును బుధవారం తెల్లవారుజామున జీహెచ్ఎంసీ రామచంద్రాపురం సర్కిల్ ఉప కమిషనర్ బాలయ్య పరిశీలించారు. వడ్డెర బస్తీలో స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం



గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గోపన్‌పల్లిలో పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

- గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్
- గోపన్‌పల్లిలో గడపగడపకూ బీజేపీ

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయడమే గడపగడపకు బీజేపీ లక్ష్యమని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో బుధవారం సాయంత్రం గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేస్తూ మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ రాష్ట్రంలో అధికారంలో రావడం ఖాయమన్నారు. అన్ని డివిజన్లలో బీజేపీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. శేరిలింగంపల్లిలో నెలకొన్న అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బీజేపీ గడపగడపకు కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభిస్తూ మొదట స్థానిక గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయంలో రవికుమార్ యాదవ్, గంగాధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, వినోద్‌రావు, ఎల్లేష్, హన్మంతునాయక్, రమేష్, పద్మ, పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

పటాన్‌చెరు: మేరు కులస్తులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మేరు కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని కులస్తులకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దీంతోపాటు బీరంగూడ గుట్టపైన వివిధ కుల సంఘాలకు 1000 గజాల చొప్పున స్థలం అందిస్తున్నామని ఆయన తెలిపారు.